Digital, tmedia.net.in

# టీ-మీడియా

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 200
సంచిక : 300
పేజీలు : 4

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

మంగళవారం, జూన్ 30, 2026

## ఏసీబీకి చిక్కిన ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్

**మట్టి'కి రూ. 2.00 లక్షల లంచం**



**టీ మీడియా,జూన్29, అశ్వారావుపేట:** ఓ రైతు నుంచి రూ. 2.00 లక్షల మొత్తాన్ని లంచంగా స్వీకరిస్తూ ఇరిగేషన్ శాఖకు చెందిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) ఎల్. శ్రీనివాస్ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో సోమవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది.ఏసీబీ వెల్లడించిన వివరాల ప్రకారం.. అశ్వారావుపేట

4లో



# సీఎం సభ రద్దు

## భారీ వర్షాల నేపథ్యంలో మార్పు..

**టి మీడియా, జూన్ 29, చింతకాని :** తెలంగాణవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది అన్నదాతలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత తీపి కబురు అందించింది. ఎప్పుడెప్పుడా అని రైతాంగం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్న రైతు భరోసా' పెట్టుబడి సాయం నిధుల విడుదలకు ముహూర్తం ఖరారైంది. మంగళవారం సాయంత్రమే ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేరుగా రైతుల ఖాతాల్లోకి ఈ నిధులను జమ చేయనున్నారు. అయితే, ఈ ప్రతిష్టాత్మక సదస్సు నిర్వహణ వేదికపై తెలంగాణ ప్రభుత్వం చివరి నిమిషంలో ఒక కీలక నిర్ణయం తీసుకుంది.వాస్తవానికి మంగళవారం నాడు ఖమ్మం జిల్లా చింతకాని లో భారీ ఎత్తున రైతు సభ నిర్వహించి.. అక్కడి నుంచే ఈ పథకం నిధులను పంపిణీ చేయాలని ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అయితే, రాష్ట్రంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఖమ్మం జిల్లాలో బహిరంగ సభ నిర్వహణకు వాతావరణం

3లో

## మావోయిస్టుల డంప్ స్వాధీనం

**టీ.మీడియా,జూన్29,చింతూరు:**ఒడిశా లోని మల్కన్‌గిరి జిల్లాలో మావోయిస్టులపై భద్రతా దళాలు మరో భారీ విజయాన్ని సాధించాయి. , లొంగిపోయిన మావోయిస్టుల నుండి అందిన సమాచారం ఆధారంగా, కాళీమేళా పోలీస్ స్టేషన్ పరిధిలోని గుంతబడ మరియు కడంగూడ అడవులలో డీవీఎఫ్ జవాన్లు గాలింపు చర్యలు చేపట్టగా, ఒక భారీ మావోయిస్టుల డిపోను కనుగొన్నారు. కనుగొన్న ఈ డంప్

4లో





## రైతుల అభ్యున్నతే సహకార బ్యాంకుల పునాది

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**-డీసీసీబీ బ్రాంచి నూతన భవనాన్ని ప్రారంభోత్సవం**



**టీ మీడియా,జూన్29,కల్లూరు:**సహకార బ్యాంకులు రైతులకు, గ్రామీణ ప్రజలందరికీ ఆర్థిక పరంగా అండగా నిలుస్తూ, పొదుపు, రుణాలు, ఇతర బ్యాంకింగ్ సేవలను సమర్థవంతంగా అందిస్తున్నాయని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరు పట్టణంలో సోమవారం ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) కల్లూరు బ్రాంచ్ నూతన భవనాన్ని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూలి, రైతులకు మరింత చేరువలో, సౌకర్యవంతమైన బ్యాంకింగ్ సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో కల్లూరులో నూతన భవనంలో డీసీసీబీ శాఖను ప్రారంభించామని తెలిపారు. రైతు సుభిక్షంగా ఉంటేనే సహకార బ్యాంకులు కూడా అభివృద్ధి చెందుతాయని అన్నారు. రైతుల ఆదాయం పెరిగి, వారు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించినప్పుడు బ్యాంకింగ్ వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని, తద్వారా మరింత మంది రైతులకు రుణాలు అందించే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు.కల్లూరు బ్రాంచ్ ఆర్థికంగా బలమైన శాఖగా ఎదగడానికి వ్యాపారవేత్తలు, ప్రజలు తమ డిపాజిట్లను సహకార బ్యాంకులోనే ఉంచేలా అధికారులు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. బ్యాంకు బలోపేతమైతే స్థానిక వ్యాపారాలు కూడా అభివృద్ధి చెందుతాయని అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని పేర్కొన్న మంత్రి, ప్రజలు తనపై ఉంచిన విశ్వాసంతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే అవకాశం లభించిందన్నారు. కల్లూరుకు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసినట్లు గుర్తు చేస్తూ, త్వరలో ఇంటిగ్రేటెడ్ సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖలు

4లో








## గిరిజన సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు రాంబాబు, జగన్

**టీ మీడియా,జూన్29,ఖమ్మం :** తెలంగాణ గిరిజన సమాఖ్య ఖమ్మంజిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా బానోత్ రాంబాబు, బానోత్ జగన్ లు ఎన్నికయ్యారు. గిరిజన సమాఖ్య ఖమ్మం జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో వీరి ఎన్నిక జరిగింది.ఏన్కూరు మండలం శ్రీరాంపురం గ్రామానికి చెందిన రాంబాబు గిరిజన సమాఖ్యలో భారత కమ్యూనిస్టు పార్టీకి -సంబంధించిన వివిధ ప్రజా సంఘాల్లో పనిచేశారు. ఖమ్మం రూరల్ మండలం కస్నాతండాకు చెందిన జగన్ గత దశాబ్ద కాలంగా గిరిజన సమాఖ్యలో వివిధ హోదాల్లో పనిచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన -సమస్యల పరిష్కారం కోసం గిరిజన సమాఖ్య నేతృత్వంలో కృషి చేయనున్నట్లు తెలిపారు. రఘునాథపాలెం మండలానికి చెందిన బానోత్ నాగేశ్వరరావును జిల్లా కార్యవర్గ సభ్యునిగా ఎన్నుకున్నారు.




## సిఐటియు మండల కమిటీ సమావేశం

**టీ మీడియా,జూన్29, ముదిగొండ:**మండలం పరిధిలో సిఐటియు జిల్లా నాయకులు ఇరుకు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా సిఐటియు ముదిగొండ మండల కన్వీనర్ టీఎస్ కళ్యాణ్ పాల్గొని ప్రసంగించారు.ఆయన మాట్లాడుతూ ఈ నెల 30వ తారీఖున బిల్డింగ్ రంగం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బిల్డింగ్ రంగ కార్మికులకు ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని లేబర్ ఇన్సూరెన్స్ నిధులను వెంటనే విడుదల చేయాలని,మండల కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండలంలో ఉన్న బిల్డింగ్ వర్కర్స్ అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక సమస్యలను పట్టించుకోకుండా బడా పెట్టుబడిదారులకు కార్పొరేటర్లకు ఊడిగంచేసే చట్టాలను తీసుకొస్తున్నారని వాటిలో భాగమే నాలుగు లేబర్ కోల్డ్ లు తీసుకొచ్చారని వాటిని తిప్పే కొట్టేవరకు కార్మికులంతా ఐక్యంగా పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాబోయే కాలంలో కార్మికుల జీవన విధానమే గడ్డు కాలంగా మారే పరిస్థితి ఏర్పడుతున్నాయని ఆయన తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి బ్రహ్మాచారి, రాడ్ బిల్డింగ్ వర్కస్,యూనియన్ జిల్లా కార్యదర్శి చట్టబోయిన వెంకటేశ్వర్లు,బిల్లింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఈశ్వర చారి, బిల్లింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు పంది నాగరాజు ,సోమయ్య ,మధు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుద్ఘాతంతో రెండు పాడి గేదెలు మృతి

### జీవనాధారం కోల్పోయామని బాధిత రైతుల ఆవేదన

**టీ మీడియా,జూన్29,సింగరేణి(కారేపల్లి):**సింగరేణి మండలం కమలాపురం సమీపంలో విద్యుద్ఘాతానికి గురై రెండు పాడి గేదెలు మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది.బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..నెమలిపురి గ్రామానికి చెందిన భూక్య రాములు,గుగులోత్ రవీందర్‌కు చెందిన పాడి గేదెలు మేత కోసం కమలాపురం సమీపంలోని పొలాలకు వెళ్లాయి.అదే సమయంలో వ్యవసాయ బోరుకు విద్యుత్ సరఫరా చేసే విద్యుత్ తీగలు బలమైన గాలుల కారణంగా తెగి పొలంలో పడిపోయాయి.విషయం తెలియక మేత మేస్తున్న గేదెలు ఆ తీగలను తాకడంతో విద్యుద్ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాయి.పాలిచ్చే గేదెలు మృతి చెందడంతో తమ కుటుంబ జీవనాధారం కోల్పోయామని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం,విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తగిన నష్టపరిహారం అందించి తమను ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.



# ఎఫ్‌పీవోతో ఆధునిక వ్యవసాయానికి ఊతం

**-డ్రోన్ సేవలు, వ్యవసాయ యంత్రాలు అందుబాటులోకి**

**టీ మీడియా,జూన్29,సింగరేణి(కారేపల్లి):**రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీవో) ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులను పరిచయం చేసి,డ్రోన్ సేవలు సహా వ్యవసాయ యంత్రాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు కారేపల్లి సహకార సంఘం చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు,ఎఫ్‌పీవో డొమైన్ ఎక్స్‌పర్ట్ చావా అరుంధతి తెలిపారు.సహకార వారోత్సవాల సందర్భంగా సోమవారం కారేపల్లి సహకార సంఘం,రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,రైతులను ఆర్థికంగా బలోపేతం చేసి,ఆధునిక వ్యవసాయ సాంకేతికతను చేరువ చేయడమే ఎఫ్‌పీవో ప్రధాన లక్ష్యమని తెలిపారు.రూ.2 వేల సభ్యత్వ రుసుముతో రైతులు ఎఫ్‌పీవోలో సభ్యులుగా చేరవచ్చని,సభ్యత్వం పొందిన ప్రతి రైతుకు కేంద్ర ప్రభుత్వం మరో రూ.2 వేల వాటా అందజేస్తుందని వివరించారు.750 మంది రైతులు సభ్యులుగా చేరితే రైతుల నుంచి సమకూరే రూ.15 లక్షలకు కేంద్ర ప్రభుత్వం మరో రూ.15 లక్షలు జోడించి మొత్తం రూ.30 లక్షల నిధులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.ఈ




నిధులతో డ్రోన్లు,ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, ఇతర ఆధునిక వ్యవసాయ పరికరాలు,నాణ్యమైన విత్తనాలు,ఎరువులు,పురుగుమందులను రైతులకు అందుబాటులో ఉంచవచ్చన్నారు.ముఖ్యంగా డ్రోన్ ద్వారా పురుగుమందుల పిచికారీ సేవలను తక్కువ అద్దెకు అందించే అవకాశముందని చెప్పారు.ఎఫ్‌పీవో ద్వారా పెద్ద పరిశ్రమలు సైతం స్థాపించే అవకాశం ఉందని,కేంద్ర ప్రభుత్వం 7 శాతం వడ్డీతో రుణ సౌకర్యంతో పాటు 50 శాతం సబ్సిడీ కూడా అందిస్తోందని తెలిపారు.రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఎఫ్‌పీవోలో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సహకార సంఘం కార్యదర్శి బొల్లు హనుమంతరావు,డైరెక్టర్లు అడ్డగొడ ఐలయ్య,మర్సకట్ల రోషయ్య,డేగల ఉపేందర్,టేకులగూడెం సర్పంచ్ గుమ్మడి సందీప్,ఉపసర్పంచ్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వినతులు సత్వరమే పరిష్కరించాలి

**-జిల్లా కలెక్టర్ అంకిత్**

**టీ మీడియా జూన్ 29,పాల్వంచ:**ప్రజల సమస్యలను సత్వరంగా, పారదర్శకంగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు.సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్ అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తో కలిసి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. భూ సమస్యలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, మౌలిక సదుపాయాలు, గృహ నిర్మాణం తదితర శాఖలకు సంబంధించిన సమస్యలను ప్రజలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారుప్రజలు సమర్పించిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్, సమస్యల స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖల అధికారులకు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరిష్కరించగల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, మిగిలిన సమస్యలను నిర్దేశిత గడువులో పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజల సమస్యల పరిష్కారానికి సమర్థవంతమైన వేదికగా వినియోగించుకోవాలని తెలిపారు. ప్రజల వినతులను కేవలం నమోదు చేయడం కాకుండా వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించి ఫలితాలు సాధించేలా అధికారులు పనిచేయాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తే సమస్యల పరిష్కారం మరింత వేగవంతమవుతుందని , ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం, నిర్లక్ష్యానికి తావు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ సేవలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలిపారు.



**ప్రజావాణిలో అందిన కొన్ని దరఖాస్తులు**

చండ్రుగొండ మండలం రుద్రంపూర్ గ్రామపంచాయతీ ప్రజలు గ్రామపంచాయతీ ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాలేదని, ప్రత్యేక గ్రామసభ నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించిన జిల్లా కలెక్టర్ తగు చర్యల కోసం చండ్రుగొండ ఎంపీడీవోకు ఎండార్స్ చేశారు.పాల్వంచ మండలం సీతారాంపేటకు చెందిన యానబోయిన మౌనిక తాను 2017లో డిప్లొమా ఇన్ ఫార్మసీ పూర్తి చేశానని, కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగోలేక ప్రభుత్వ వైద్యశాలలో ఫార్మసిస్ట్ ఉద్యోగం కల్పించాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం జిల్లా ఉపాధి కల్పనాధికారికి ఎండార్స్ చేశారు.అశ్వాపురం మండలం కోండికుంట గ్రామపంచాయతీ పరిధిలోని మొండికుంట గ్రామంలో రూ.1.50 కోట్ల వ్యయంతో 2023లో ప్రారంభించిన డ్రైనేజీ నిర్మాణ పనులు ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో మురుగునీరు నిల్వ ఉండి దోమల వ్యాప్తి పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామ సర్పంచ్ సమర్పించిన దరఖాస్తును పరిశీలించిన జిల్లా కలెక్టర్, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్ అండ్ బి శాఖ అధికారులకు ఎండార్స్ చేశారు.బూర్గంపహాడ్ మండలం లక్ష్మీపురం గ్రామంలో తన తండ్రి జక్కం కృష్ణమూర్తి పేరుపై ఉన్న సర్వే నెం. 440/20/అ లోని 4 ఎకరల 27 కుంటల భూమిని వారసత్వంగా తన పేరుపై మార్చి పట్టాదారు పాస్‌బుక్ మంజూరు చేయాలని బూర్గంపహాడ్‌కు చెందిన జక్కం శ్యామ్ సమర్పించిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల కోసం బూర్గంపహాడ్ తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని చట్టపల్లి ప్రాంతంలో అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారని, వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని లింగాల సాయికుమార్ సమర్పించిన దరఖాస్తును పరిశీలించిన జిల్లా కలెక్టర్ తగు చర్యల కోసం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి ఎండార్స్ చేశారు.ప్రజలు తమ వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలను సమర్పించడం ద్వారా సమస్యల పరిష్కార ప్రక్రియ మరింత వేగవంతమవుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు, వారి సమస్యలకు సత్వర పరిష్కారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఫిర్యాదుదారులకు తక్షణమే న్యాయం

**-ఎస్పీ డా. శబరీష్,**

**టీ మీడియా, జూన్ 29, కురవి:**పోలీస్ స్టేషన్ వచ్చేఫిర్యాదుదారులకు తక్షణమే న్యాయం జరిగేలా చూడాలని జిల్లా ఎస్పీ డా. శబరీష్ అన్నారు.మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డీఎస్పీ కార్యాలయాన్ని ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్. సోమవారంతనిఖీ చేశారు.ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లకు సంబంధించిన కేసు డైరీలు, విచారణలో ఉన్న పెండింగ్ కేసులు, పోక్సో కేసులు, మహిళలపై నేరాలకు సంబంధించిన కేసుల దర్యాప్తు పురోగతి, సీసీటీఎన్ఎస్ లో కేసుల ఆన్‌లైన్ నమోదు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. దర్యాప్తులో నాణ్యతను పెంచుతూ, పెండింగ్ కేసులను సత్వరమే పూర్తి చేయాలని అధికారులకు ఎస్పీ అధికారులకు సూచించారు.అనంతరం సీఐలు, ఎస్ఐలతో సమావేశమై ప్రజలతో నిరంతరం మమేకమై స్థానిక సమాచారాన్ని సేకరించాలని, నేరాల నివారణకు ముందస్తు



చర్యలు తీసుకోవాలని, ప్రతి పోలీసు అధికారి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.తదుపరి ఎస్పీ డా. శబరీష్ ఐపీఎస్. చింతలపల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, యువత మరియు గ్రామస్థులతో శాంతి భద్రతల విషయంలో వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.దొంగతనాల నివారణకు గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని, గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు నేరాల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. అత్యవసర సమాచారం, అనుమానాస్పద సంఘటనలు, భద్రతా హెచ్చరికలను వెంటనే పరస్పరం పంచుకునేందుకు గ్రామ స్థాయిలో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం అత్యంత ముఖ్యమని, పోలీసులు,ప్రజల సమన్వయంతోనే నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని ఎస్పీ డా. శబరీష్ ఐపీఎస్. పేర్కొన్నారు.

# విద్యా సేవలకు ఘన వీడ్కోలు

పదవీ విరమణ చేసిన శ్రీదాస్యం రమేష్‌కు ఘన సన్మానం



టీ మీడియా.జూన్29,సింగరేణి(కారేపల్లి):సింగరేణి మండలం మాణిక్యారం మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా సుదీర్ఘకాలం సేవలందించిన శ్రీదాస్యం రమేష్ ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్న సందర్భంగా సోమవారం పాఠశాల ఆవరణలో ఘనంగా వీడ్కోలు,సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ప్రాథమిక,ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు,అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు సంయుక్తంగా ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి దుగ్గిరాల జయరాజు మాట్లాడుతూ,శ్రీదాస్యం రమేష్ క్రమశిక్షణ,సేవాభావం,విద్యార్థుల పట్ల అంకితభావంతో పనిచేసి ఆదర్శ ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందారని కొనియాడారు.విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.విశ్రాంత జీవితాన్ని ఆరోగ్యంగా,ఆనందంగా గడపాలని ఆకాంక్షిస్తూ పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం శ్రీదాస్యం రమేష్--అనిత దంపతులను ఎంఈఓ జయరాజు,ఉపాధ్యాయులు,వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యారంగానికి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకుని అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా పద్మ వాచ్యా,ఉపసర్పంచ్ భూక్యా సునీత,ప్రధానోపాధ్యాయులు కేళోత్ కిషన్,ఉపాధ్యాయురాలు స్వర్ణలత,అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ జ్యోతి,స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు టి. శారద, ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు దేవరకొండ సైదులు,వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు,స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు,విద్యార్థులు, శ్రీదాస్యం రమేష్ కుటుంబ సభ్యులు,స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.



## రైతు భరోసాతో వ్యవసాయానికి మరింత బలం

టీ మీడియా.జూన్29,సింగరేణి(కారేపల్లి):సింగరేణి మండలంలోని రైతులందరికీ సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు, గాదెపాడు సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.సోమవారం గాదెపాడులో ఆయన మాట్లాడుతూ,ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులన్నీ నిండాలని,పంటలు సమృద్ధిగా పండుతూ రైతన్నల ఇళ్లలో సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని పేర్కొన్న ఆయన,హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో మంగళవారం సాయంత్రం నిర్వహించే రైతు భరోసా పంపిణీ సదస్సు ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందజేయనున్నట్లు తెలిపారు.మండలంలోని రైతులు తమ సమీప రైతు వేదికలకు మంగళవారం సాయంత్రం చేరుకుని ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని టెలికాన్ఫరెన్స్ ద్వారా వీక్షించాలని కోరారు.రైతులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయాభివృద్ధికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



## మృతురాలి కుటుంబానికి అండగా సర్పంచ్ దండు ప్రవీణ్

రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేత

టీ మీడియా.జూన్29,సింగరేణి(కారేపల్లి): సింగరేణి మండలం అప్పాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని భిక్య తండా గ్రామానికి చెందిన అజ్మీరా ఈరి సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు.విషయం తెలుసుకున్న అప్పాయిగూడెం సర్పంచ్ దండు ప్రవీణ్ మృతురాలి నివాసానికి చేరుకుని భౌతికకాయానికి పూలతో నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.మృతురాలి కుటుంబానికి సానుభూతి సూచకంగా తన సొంత నిధుల నుంచి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ దండు ప్రవీణ్ మాట్లాడుతూ,ఈ క్లిష్ట సమయంలో అజ్మీరా ఈరి కుటుంబానికి గ్రామపంచాయతీ తరపున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఈ విషాదాన్ని అధిగమించాలని కోరారు.మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని,కుటుంబ సభ్యులకు ఈ దుఃఖాన్ని భరించే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎట్టి సంధ్యారాణి,వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అజ్మీర ఈరికి మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ నివాళి

టీ మీడియా.జూన్29,సింగరేణి(కారేపల్లి):సింగరేణి మండలం అప్పాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని భిక్య తండాకు చెందిన బీఆర్ఎస్ మండల మాజీ ప్రధాన కార్యదర్శి అజ్మీర వీరన్న మాతృమూర్తి అజ్మీర ఈరి సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు.విషయం తెలుసుకున్న వైరా మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ మృతురాలి నివాసానికి చేరుకుని భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఆత్మకమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ,మాజీ జెడ్పీటీసీ ఉన్నం వీరేందర్,మాజీ ఎంపీపీ మాలోత్ శకుంతల,మాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు,మాజీ సొసైటీ వైస్ చైర్మన్ దారావత్ మంగీలాల్,మాజీ ఉపసర్పంచ్ గద్దం వెంకటేశ్వర్లు,నాయకులు భూక్యా రాంకిషోర్,జర్పుల ప్రసాద్,బానోతు కోటి,గుగులోత్ హారు, వాంకుడోత్ కరణ్ సింగ్,వాంకుడోత్ విజయ్,జూపల్లి రాము,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



## యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ కమిటీ ఎన్నిక

టీ.మీడియా.జూన్29.,చింతూరు:

ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ పోలవరం జిల్లా తొలి సమావేశం చింతూరు డివిజన్ నిమ్మలగూడెంలోని జేకేసీటీ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు మాసినేని చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి బి. సత్యనారాయణ, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు ఎ. వీరబాబు, కార్యదర్శి పి. వెంకట సమక్షంలో చింతూరు డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.చింతూరు డివిజన్ అధ్యక్షుడిగా ఎం.డి. సౌకత్ అలీ (సాక్షి), కార్యదర్శిగా నీలపు రాజేష్ రెడ్డి (హెచ్ఎం టీవీ) ఎన్నికయ్యారు.ఉపాధ్యక్షులుగా బి. ఈశ్వర చారి (ప్రైమ్ 9), ధన్నాన రామారావు (ఆంధ్రప్రతిక), కోశాధికారిగా ఎన్. రమేష్ (విశాలాంధ్ర), సహాయ కార్యదర్శులుగా బి. రాంబాబు (ఆంధ్ర ప్రభ), బి. నాగేంద్ర కుమార్ (సూర్య) ఎన్నికయ్యారు.కమిటీ సభ్యులుగా టి. వెంకటరామయ్య (మన వార్త), ఎస్. తమ్మయ్య (జనం న్యూస్), ఇ. రమేష్ (సాక్షి), ఎం. శ్రీను (ఈనాడు) ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.ఈ కార్యక్రమంలో జిల్లా యూనియన్ జాయింట్ సెక్రటరీ ఎం. రామకృష్ణ (టీవీ5), కె. జీవన్ కుమార్ (మహాన్యూస్), జిల్లా ఉపాధ్యక్షులు బాల నారాయణ, ఉదయ్, ఏడుకొండలు, బి. శ్రీను, ఎం. సత్తిబాబు, జి. ప్రభాకర్, ఎ. సూరిబాబు, పి. మోహన్, టి. దుర్గా ప్రసాద్, కోశాధికారి సత్యశేఖర్, సభ్యులు వార్త రమణ, సాక్షి బాబురావు, వి.వి.ఎస్.టి శ్రీనివాస్ రావు, విశాలాంధ్ర భాస్కర చారి పాల్గొన్నారు.

## సీఎం సభ రద్దు

ఏమాత్రం అనుకూలించలేదు. దీంతో రైతులు, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మధిర రైతు సభను ప్రభుత్వం తక్షణమే రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది.

**నిధుల విడుదలలో ఆలస్యం వద్దు..**

మధిరలో బహిరంగ సభ రద్దయినప్పటికీ.. రైతులకు పెట్టుబడి సాయం అందించడంలో ఎలాంటి ఆలస్యం జరగకూడదని సీఎం రేవంత్ రెడ్డి గట్టిగా నిర్ణయించారు. వానాకాలం (ఖరీఫ్) సీజన్ ప్రారంభమైనందున రైతులకు ఈ సమయంలో డబ్బులు చాలా అవసరమని భావించిన ముఖ్యమంత్రి.. ఈ సదస్సును తక్షణమే హైదరాబాద్‌కు తరలించాలని ఆదేశించారు. దీంతో మంగళవారం సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్ మాదాపూర్‌లోని శిల్పకళా వేదిక లో రైతు భరోసా అధికారిక సమావేశం జరగనుంది. ఈ ఇండోర్ సదస్సులోనే సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి కంప్యూటర్ బటన్ నొక్కి నిధులను రైతుల అకౌంట్లలో జమ చేయనున్నారు.



జర్నలిస్ట్ సమాజం పట్ల

## బాధ్యత కలిగి ఉండాలి

టీ.మీడియా.జూన్29.,చింతూరు:

ప్రతి జర్నలిస్ట్ సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలని చింతూరు తెలుగుదేశం మండల అధ్యక్షులు, జెకె ట్రస్ట్ చైర్మన్ ఎండి జమాల్ ఖాన్ పేర్కొన్నారు. సోమవారం ఏపీడబ్ల్యూజే సర్వసభ్య మొదటి సమావేశం నిమ్మలగూడెం గ్రామంలోని జేకే ట్రస్ట్ భవనంలో నిర్వహించారు. ఈ సభలో జమాల్ ఖాన్ ప్రసంగిస్తూ గన్ కంటే పెన్ను గొప్పదని,సమాజంలో జర్నలిస్టులు పదిమందికి ఉపయోగపడే వార్తలు రాయాలని కోరారు. ఏపీడబ్ల్యూజే పోలవరం శాఖ ఆంధ్రప్రదేశ్ లోనే మంచి పనులు చేస్తూ అగ్రగామిగా ఉండాలని కోరారు. విలేకరుల హెల్త్ కార్డు ల కోసం లక్ష రూపాయలు విరాళం ఇచ్చారు.అనంతరం యూనియన్ నాయకులు సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ విలేకరుల సంక్షేమమే లక్ష్యంగా ఏపీడబ్ల్యూజే పనిచేస్తుందని అన్నారు. రంపచోడవరం జిల్లా అధ్యక్షులు మాసినేని చంద్రశేఖర్ మాట్లాడుతూసత్యనారాయణ మూర్తి ఐదు వేల రూపాయలు, అడ్డతీగల నాయకులు వీరబాబు 5వేల రూపాయలు సంక్షేమ నిధికి విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ మాసినేని చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఏపీడబ్ల్యూజే సభ్యులు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని అన్నారు. ఇళ్ల స్థలాల కోసం దశలవారీగా ఎమ్మెల్యే, ఐటీడీఏ పీవో కు, జిల్లా కలెక్టర్కు విజ్ఞాపన పత్రాలు సమర్పిస్తామని పేర్కొన్నారు. త్వరలో అందరికీ హెల్త్ కార్డులు అందజేస్తామని పేర్కొన్నారు. అనంతరం చింతూరు డివిజన్ కమిటీ ఎన్నిక జరిగింది. ఏ సమావేశంలో జిల్లాలోని సుమారు 80 మంది ఏపీడబ్ల్యూజే, నాయకులు,సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా హాజరైన సభ్యులకు భోజనం ఏర్పాటు చేశారు.

## మావోయిస్టుల డంప్ స్వాధీనం

నుండి భారీ పరిమాణంలో ఆయుధాలు, పేలుడు పదార్థాలు, వాకీ-టాకీలు ,ఇతర మావోయిస్టు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సామగ్రిలో 2 ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు, 3 పిస్టళ్లు (ఒకటి అమెరికాలో తయారైనది), .303 గన్ బ్యారెళ్లు, 2 కేజీలు మరియు 5 కేజీల బరువున్న 2 ఐఈడీలు ఉన్నాయి.అక్కడ చాలా పేలుడు పదార్థాలు, నిత్యవసర వస్తువులు ఉన్నాయి, వాటిలో ఒక క్లేమోర్ మైన్, 4 బీజీఎల్ సెల్స్, 7 వాకీ-టాకీలు, 45 పెన్ డ్రైవ్‌లు, హార్డ్ డిస్కులు, పవర్ బ్యాంకులు, బ్యాటరీలు, మెడిసిన్ కిట్లు ఉన్నాయి.పోలీసుల అనుమానం ప్రకారం, ఈ ఆయుధాలు, పేలుడు పదార్థాలు ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రత్యేక జోనల్ కమిటీకి చెందిన మావోయిస్టు కేడర్లకు చెందినవి. సామాన్య ప్రజలను, భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకునేందుకే ఈ సామగ్రిని నిల్వ చేశారని అనుమానిస్తున్నారు.ఈ జూన్‌లో ఇది మూడవ ప్రధాన మావోయిస్టు డంప్ ఆపరేషన్ అని ఇక్కడ ప్రస్తావించడం ముఖ్యం. మొదటిది జూన్ 9న కిర్మితి మరియు మత్తి పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగింది.జూన్ 15న కటువాపడ అడవి నుండి ఎల్ ఎం జి లు, ఇన్సాస్ రైఫిళ్లు, ఐఈ డి లు గ్రెనేడ్లను స్వాధీనం చేసుకోగా, పోడియా పోలీస్ స్టేషన్ పరిధిలోని శిలకోట, పెర్వాయి, కెన్కుగూడ ప్రాంతాల నుండి స్టెయిన్ కార్ట్రిడ్జ్‌లు, పిస్టళ్లు, ఐ ఈ డి లు,యూ బి జి యల్ గ్రెనేడ్లు, ఇతర మావోయిస్టు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వినోద్ పాటిల్ హెచ్ ఈ విషయాన్ని తెలిపారు. మావోయిస్టు కార్యకలాపాలు పునరావృతం కాకుండా నిరోధించడానికి జిల్లాలోని వివిధ అటవీ ప్రాంతాల్లో సంయుక్తంగా చెట్లను నరికివేత, గాలింపు చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## రైతుల అభ్యున్నతే సహకార బ్యాంకుల పునాది

ఒకే ప్రాంగణంలో ఉండేలా ఆధునిక పరిపాలనా సముదాయాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని వెల్లడించారు. కల్లూరు మండలంలో సాగునీరు, తాగునీరు, రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, మౌళిక సదుపాయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని మంత్రి అన్నారు. గతంలో మండల కార్యాలయాలు, కళాశాల భవనాలు, నీటి పథకాలు, లిఫ్ట్ ఇరిగేషన్ వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు.వేంసూరులో నిర్మాణంలో ఉన్న పామాయిల్ ఫ్యాక్టరీ త్వరలో ప్రారంభమైతే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి తెలిపారు. ఖమ్మం-- అశ్వారావుపేట పాత రహదారిని నాలుగు లైన్ల జాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు మంత్రి తెలిపారు. అలాగే గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారికి ఎగ్జిట్, ఇతర మౌళిక వసతుల కల్పనకు కూడా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. సత్తుపల్లి నియోజకవర్గానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మంచి పేరును మరింత పెంచేలా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని, రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర ప్రభుత్వం ద్వారా ఏ అవకాశం వచ్చినా ముందుగా సత్తుపల్లి నియోజకవర్గానికి తీసుకురావడానికి కట్టుబడి ఉంటానని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు .కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యేమట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ, డిసిసిబి బ్యాంక్ ప్రయివేట్ బ్యాంకుల కంటే తక్కువ వడ్డీకే ఋణాలందిస్తున్నట్లు తెలిపారు. రైతులు సకాలంలో తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించాలన్నారు. రైతులకు ఎన్ని రకాల రుణాలు వస్తాయో అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఓ గంగాధర్, ఏసీపీ వసుంధర యాదవ్, బ్యాంక్ సిఇఒ ఎన్. వెంకట ఆదిత్య, డిజిఎం ఎం. సర్వేశ్వర రావు, ఏజిఎం బి. చందర్ రావు, మేనేజర్ ఎం. అనిత, కల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బాగం నీరజ, కల్లూరు మునిసిపల్ చైర్మన్ ఎం. మోహన్, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మాదిగలు ఉన్నత స్థాయిలో నిలవాలి

-గట్టిగుండ్ల ఉద్బోధ.

**టీ మీడియా ,జూన్ 29 ,కూసుమంచి:** సమస్యలన్నింటిని అధిగమిస్తూ పట్టుదలతో విద్యను ఉన్నత స్థాయిలు నిలిచేందుకు కృషి చేయాలని మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు గట్టిగుండ్ల దుర్గయ్య ( దుర్గారావు ) విద్యార్థులకు ఉద్బోధ చేశారు. విద్య పట్ల మాదిగలో అవగాహన పెంచేందుకు జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా సోమవారం పాలేరు గ్రామ మాదిగ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కూసుమంచి మండల మాదిగ ఉద్యోగుల సమైక్య ప్రధాన కార్యదర్శి గోపే లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సదస్సు లో ఆయన గట్టిగుండ్ల మాట్లాడుతూ విద్యను మధ్యలో నిలిపివేసిన ప్రతి ఒక్కరూ ఇప్పటికైనా విద్యను కొనసాగించాలని, అందుకు ప్రభుత్వం డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నాటి నుంచి ఆర్థికంగా వెనుక బాటులో ఉన్నందునే తమ మాదిగ జాతి ప్రజలు విద్యకు దూరమయ్యారని, తద్వారా అన్ని రంగాల్లో అన్యాయంకి పాలే ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమగ్ర విద్యను అందించేందుకు ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలు అన్నింటిని ఉపయోగించుకుంటూ ముందుకు సాగాలని ఆయన కోరారు నాటి అవమానాలు సమస్యలను అధిగమించి నిలిచిన భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ విద్యావంతులుగా సమాజము లో ముందుండి, మాదిగ ప్రజల అభ్యున్నతి కోసం తమ వంతు కృషి చేయాలని గట్టిగుండ్ల దుర్గయ్య ( దుర్గారావు ) కోరారు. ఈ సదస్సులో కూసుమంచి మండల మాదిగ ఉద్యోగుల సమైక్య అధ్యక్షులు బుర్ర రామారావు, ప్రధాన కార్యదర్శి గోపె లక్ష్మీనారాయణ, ప్రచార కార్యదర్శి మందుల బిక్షం, సహాయ కార్యదర్శి కన్నెర రాంబాబు , పాలేరు గ్రామ ఎమ్మార్పీఎస్ నాయకులు గోపె ఉప్పయ్య (



ఉపేందర్ ) తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాలేరు గ్రామ ఎమ్మార్పీఎస్ నాయకులు గోపే గురవయ్య, నూక పొంగు వీరస్వామి,గోపే రామకృష్ణ, శ్రీను, సుందరయ్య, నాగేంద్రబాబు, శంకర్, ఉప్పయ్య, రమేష్, లక్ష్మణరావు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో కనిపించని అధికారులు..!

**ప్రజల సమస్యలు వినేవారే కరువు**

**అధికారుల గైర్హాజరుతో ప్రజల్లో ఆగ్రహం**

**టీ మీడియా,జూన్29,సింగరేణి(కారేపల్లి):**ప్రజల సమస్యలను నేరుగా విని పరిష్కరించేందుకు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సింగరేణి మండలంలో నామమాత్రంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.సోమవారం నిర్వహించిన ప్రజావాణికి పలువురు శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో తమ సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.దూర ప్రాంత గ్రామాల నుంచి ఖర్చులు పెట్టుకుని,పనులు మానుకుని వచ్చిన ప్రజలకు అధికారులు కనిపించకపోవడంతో నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు.సమస్యలు వినాల్సిన అధికారులు కార్యాలయాలకు రాకపోవడం వల్ల దరఖాస్తులు ఎవరికివ్వాలో తెలియక ప్రజలు గంటల తరబడి వేచి చూసి వెనుదిరిగిన పరిస్థితి నెలకొంది.ప్రతి సోమవారం ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికగా ఉండాల్సిన ప్రజావాణి కార్యక్రమం అధికారుల నిర్లక్ష్యంతో ప్రహసనంగా మారిందని ప్రజలు మండిపడుతున్నారు.ప్రభుత్వమే ప్రజలకు అందుబాటులో ఉండాలని చెబుతుంటే,క్షేత్రస్థాయిలో అధికారులు మాత్రం బాధ్యతలను విస్మరిస్తున్నారని విమర్శిస్తున్నారు.

**ప్రజల డిమాండ్**

ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని,గైర్హాజరయ్యే అధికారులపై ఉన్నతాధికారులు క్రమశిక్షణ చర్యలు



తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.ప్రజావాణిని పేరుకే కాకుండా ప్రజలకు నిజమైన సమస్యల పరిష్కార వేదికగా మార్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రెస్ క్లబ్‌లో పాత్రికేయులకుఐడి కార్డుల పంపిణీ

**టీ మీడియా, జూన్ 29,దమ్మపేట:**అశ్వారావుపేట నియోజకవర్గంలోని దమ్మపేట గ్రామంలోని దమ్మపేట ప్రజా ప్రెస్ క్లబ్ కార్యాలయంలో ఈరోజు పాత్రికేయులకు క్లబ్ ఐడి కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దమ్మపేట గ్రామపంచాయతీ సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు దమ్మపేట ఎస్సై రాజేష్ కుమార్ సిపిఐ ఎంఎల్ పార్టీ జిల్లా రైతు సంఘ అధ్యక్షులు పండూరి వీరబాబు పాత్రికేయులకు ఐడి కార్డులు అందజేశారు .సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో పాత్రికేయులు కీలకపాత్ర పోషిస్తున్నారని, ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం లో మీడియా సేవలు ఎంతో విలువైనవని కత్తి కన్నా కలం చాలా గొప్పది అంటూ.ఆకలాన్ని చాలా గొప్పగా ఉపయోగించాలని అన్నారు.ఎస్సై రాజేష్ కుమార్‌లి మాట్లాడుతూ పాత్రికేయుల వృత్తి ఎంతో బాధ్యతాయుతమైనది ఆ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేయాలని సూచించారు. పాత్రికేయుల సంక్షేమం, భద్రతకు, ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ నాయకులు పండూరి వీరబాబులి మాట్లాడుతూ సప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిరంతరం సేవలందించాలని సూచించారు.ప్రెస్ క్లబ్ చైర్మన్ దస్తగిరి, అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నడిసాయి, వైస్ చైర్మన్ మేకల ఉపేందర్, నీలం రాజేశ్వరి, ప్రచార కార్యదర్శి, ఎండి సలార్, కార్యవర్గ సభ్యులు బి ఆనంద్, బి




రాజేష్, ఎస్.కె కాసిం, సిహెచ్ శ్రీనివాసరావు, పి కిరణ్, టి సాయి కృష్ణ, డి గోపి, బి నాగ శివాజీ, ఎస్ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీకి చిక్కిన

మండలంలోని దొంతికుంట చెరువు నుంచి శిఖం భూమిలో మట్టి తోలుకునేందుకు అనుమతి కోసం ఓ రైతు ఇరిగేషన్ విభాగానికి చెందిన ఏఈఈ శ్రీనివాస్ ను సంప్రదించారు. ఇందుకు రైతు నుంచి ఆయా ఇంజనీర్ రూ. 4.00 లక్షల మొత్తాన్ని లంచంగా డిమాండ్ చేశాడు. అయితే ఇంజనీర్ కు లంచం ఇవ్వడం ఇష్టం లేని రైతు ఏసీబీ అధికారులను సంప్రదించారు.ఈమేరకు వలపన్నిన ఏసీబీ అధికారులకు ఏఈఈ శ్రీనివాస్ రూ. 2.00 లక్షల మొత్తాన్ని లంచంగా స్వీకరిస్తూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డాడు. తన కార్యాలయంలోనే శ్రీనివాస్ రైతు నుంచి లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏఈఈ శ్రీనివాస్ ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసి, కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సమాచారం. కాగా ఇదే రైతు గతంలోనూ విద్యుత్ శాఖకు చెందిన ఓ అసిస్టెంట్ ఇంజనీర్ ను ఏసీబీకి పట్టించినట్లు తెలుస్తోంది. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇరిగేషన్ శాఖలో కలకలం రేపింది.